క్లుప్తంగా

పెద్దింట్లమ్మకు ఎమ్మెల్యే పూజలు



కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) కుటుంబ సమేతంగా సోమవారం సందర్శించారు. ఆలయ ఈవో కందుల వేణుగోపాలరావు అమ్మవారి దర్శనం అనంతరం ఆలయ సంప్రదాయం ప్రకారం ఎమ్మెల్యేను సన్మానించారు. అర్చకులు వేద ఆశీర్వాచనాలు అందించారు. అనంతరం ఆలయం వద్ద జరుగుతున్న అనివేటి మండప నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డీఎన్నార్ సతీమణి వీరాకుమారి, కుమారులు వినయ్, శ్యామ్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేడు 'ఏపీకి జగనన్న ఎందుకు కావాలి' కార్యక్రమం

గుడివాడరూరల్: ఏపీకి జగనన్న ఎందుకు కావాలి, పల్లెకుపోదాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్ కోరారు. మండలంలోని రామనపూడి గ్రామంలో మంగళవారం నిర్వహించనున్న ఏపీకి జగనన్న ఎందుకు కావాలి, పల్లెకు పోదాం కార్యక్రమాన్ని సచివాలయం వద్ద నిర్వహించనున్నామని ఈకార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు జరిగిన అభివృద్ధి, చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ గద్దే పుష్పరాణి, జెడ్పీటీసీ గోళ్ల రామకృష్ణ, ఇతర అధికారులు హాజరవుతారని ఆయన తెలిపారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి

ముదినేపల్లి రూరల్: ప్రస్తుత పరిస్థితుల్లో అపరిచిత వ్యక్తులతో యువతులు అప్రమత్తంగా మెలగాల్సి ఉందని ఎస్ఐ వెంకట్‌కుమార్ అన్నారు. ఇందుకు సంబంధించి స్థానిక ఎస్సీ బాలికల హాస్టల్ విద్యార్థినులకు సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సెల్‌ఫోన్లు ఇతర మార్గాల ద్వారా పలువురు దుండగులు యువతులను రకరకాల వంచనలకు గురిచేస్తున్నారన్నారు. ఇలాంటి వారి పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరముందన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి విద్యార్థులకు వివరించారు.

అనాథల పాఠశాలకు కూరగాయల వితరణ



మోపిదేవి: మోపిదేవికి చెందిన విశ్రాంతి ఉపాధ్యాయుడు రావి సుధాకర్ రెడ్డి, సౌదామని దంపతులు రూ.10 వేలు విలువ గల కూరగాయలను అనాథ పిల్లల అన్నదానం నిమిత్తం పాఠశాలకు ప్రత్యేక వాహనంలో సోమవారం పంపారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం తోటపల్లి గ్రామంలోని హిల్ ప్యారడైజ్ పాఠశాలలోని వెయ్యి మంది విద్యార్థులకు వితరణగా ఈ కూరగాయలు అందజేశామని దాత రావి దంపతులు తెలిపారు. నూతక్కి శివబాబు, బాబీ, స్థానికులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



మచిలీపట్నంటౌన్: ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐసీఈయూ) మచిలీపట్నం డివిజన్ 55వ మహాసభ వాల్‌పోస్టర్‌ను సంఘ నాయకులు సోమవారం ఆవిష్కరించారు. స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. డిసెంబర్ 9వ తేదీన బాపట్లలో ఈ మహాసభ జరుగుతుందన్నారు. ఐదు జిల్లాలకు చెందిన ఇన్సూరెన్స్ ఉద్యోగులు మహాసభలో పాల్గొంటారని ఆ సంఘ డివిజన్ ప్రధాన కార్యదర్శి జి.కిషోర్‌కుమార్ తెలిపారు.

గుడివాడకు కొత్త కాలనీ కళ

- శరవేగంగా నిర్మాణం
- కోట్లాది రూపాయలతో వసతులు
- వివిధ దశల్లో 3,709 గృహాలు



విద్యుత్ సబ్‌స్టేషన్



జగనన్న కాలనీ

గుడివాడ టౌన్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గుడివాడకు కొత్తగా వచ్చిందేమంటే టక్కున గుర్తుకు వచ్చేది జగనన్న కాలనీ. రోడ్లు, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతులతో ఈ కాలనీ కొత్తగా ఏర్పాటైంది. పట్టణంలోని మల్లాయిపాలెం లే అవుట్‌లో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయి. నిర్మాణంలో ప్రతీరోజూ అభివృద్ధిలో నంబర్-1, వారాంతపు పురోగతిలో నంబర్-1, మొత్తం నిర్మాణాల్లో పార్లమెంట్ నియోజకవర్గ పరిధి లోనే గుడివాడ యూనిట్ నంబర్-1 స్థానంలో నిలవడం ఇక్కడ జగనన్న కాలనీ అభివృద్ధికి నిదర్శనం.

3,709 గృహాలు..

మొత్తం గృహాల లక్ష్యం 3,709 కాగా బేస్‌మెంట్ స్థాయి 179, స్లాబ్ వరకు 1517, రూఫ్‌లెవల్ 1726, ఆర్‌సీ లెవల్ 254, పూర్తయిన గృహాలు 33 ఉన్నాయి. దీంతో గుడివాడ యూనిట్ గృహ నిర్మాణాలు స్థాయి రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందేలా వేగవంతంగా సాగుతున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యంలోపే ఈ నిర్మాణాలు పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తామని అధికారులు అంటున్నారు.

మౌలిక వసతులకు రూ.10 కోట్లకు పైగా..

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులకు రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుందని అధికారులు అంటున్నారు. నిబంధనల ప్రకారం హౌసింగ్ కాలనీ ఏర్పాటులో రహదారులు, విద్యుత్, నీటి సరఫరా ప్రధాన అంశాలు. ఇందులో రహదారుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.8 కోట్లు నిధులు కేటాయించగా నీటి సరఫరాకు రూ 1.80 కోట్లు, 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు రూ.30 లక్షల నిధులు కేటాయించారు. రహదారుల నిర్మాణం పూర్తికాగా సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తయింది. టిడ్కో గృహాల వద్ద భారీ వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తికావస్తున్న నేపథ్యంలో మంచినీటి సరఫరా కూడా లబ్ధిదారులకు అందుబాటులోకి వచ్చింది. సాధ్యమైనంత త్వరలో నిర్మాణాలు పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తామని హౌసింగ్ అధికారులు అంటున్నారు.

అన్నివిధాలా సబ్సిడీలు..



ప్రభుత్వం పేదవాని సొంతింటి కల నెరవేర్చే లక్ష్యంతో నిర్మాణ వ్యయం తగ్గించేందుకు అనేక సబ్సిడీలు కల్పించింది. నిర్మాణంలో అవసరమైన ఇనుము, సిమెంట్, సిమెంట్ ఇటుకలు, సబ్సిడీలో అందజేయడంతో పాటు 14 రకాల గృహ వినియోగ వస్తువులు నామమాత్రపు ధరకు అందజేస్తున్నాం. నిర్మాణం పూర్తయ్యే వరకు ఇసుక ఉచితంగా అందజేస్తున్నాం. దీంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం వేగవంతం చేస్తున్నారు.

-రామోజీ నాయక్, డీఈ, హౌసింగ్

జగనన్నకు రుణపడి ఉంటాం..



నా సొంతింటి కల నెరవేరింది. అద్దె ఇంట్లో ఉండగా నాతల్లి మృతి చెందింది. సామాజిక సంప్రదాయాలు ఆ సమయంలో మమ్ములను చాలా ఇబ్బంది పెట్టాయి. సొంతింటి అవసరం అప్పుడు తెలిసింది. ఇల్లు లేని కష్టాలు అనుభవిస్తున్న మాకు జగనన్న కాలనీలో స్థలం ఇచ్చారు. పేదవాడి సొంతింటి కల నెరవేరుస్తున్న జగనన్నకు రుణపడి ఉంటా.

- కె.మేరీ, లబ్ధిదారు

ఆర్థిక సహకారం అందజేస్తున్నాం..



జగనన్న కాలనీలలో లబ్ధిదారులను ప్రోత్సహించేందుకు ఆర్థికంగా అనేక ప్రోత్సాహకాలు కల్పిస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ.1.80 లక్షలతో పాటు డ్వాక్రా సభ్యులకు రూ.35 నుంచి రూ.50 వేల వరకు వ్యక్తిగత రుణం అందజేస్తున్నాం. సహకార బ్యాంకుల నుంచి రూ.లక్ష వరకు రుణాలు మంజూరు చేయిస్తున్నాం. దీంతో లబ్ధిదారు పెట్టుబడి తక్కువ కావడంతో గృహ నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి.

-వి.మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్

ఉత్సాహంగా దీపావళి వేడుక



మంటాడలో దీపావళి వేడుకల్లో మహిళలు

కైకలూరు: దీపావళి పండుగను నియోజకవర్గ ప్రజలు ఆదివారం ఉత్సాహంగా జరుపుకున్నారు. కైకలూరులో ఎమ్మెల్యే దూలం నాగేశ్వర రావు (డీఎన్నార్) కుటుంబ సభ్యులతో కలసి టపాసులు కాల్చారు. కైకలూరు టౌన్ స్టేషన్‌లో సీఐ ఆకుల రఘు ఆధ్వర్యంలో పేద చిన్నారులకు నూతన వస్త్రాలు, స్వీట్లు పంపిణీ చేశారు. వారితో టపాసులు కాల్పించారు. కైకలూరు బైపాస్‌రోడ్‌లో టపాసులు కారణంగా ఎండిన కొబ్బరి చెట్టు కాలింది. భారీ అగ్నిప్రమాదాలు జరగలేదని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

ఘనంగా దీపావళి వేడుకలు

కలిదిండి: దీపావళి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. మహిళలు ప్రత్యేకంగా లక్ష్మీదేవీ పూజలు నిర్వహించారు. సాయంత్రం వేళలో వాకిళ్లముందు అందమైన ముగ్గులు వేసి ప్రమిదలు వెలిగించారు. రకరకాల రంగుల క్రాకర్లు, పటాస్‌లు కాల్చి సందడి చేశారు. టపాసుల విక్రయ కేంద్రాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

ఘనంగా 'దీపావళి' వేడుకలు

పామర్రు: దీపావళి పండుగను ఆదివారం ప్రజలు అందరూ ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా జరుపుకున్నారు. పండుగరోజున లక్ష్మీ దేవికి విశేషంగా పూజలు చేసి సాయంత్రం వేళ పలు రకాల టాపాసులను వెలిగించి పండుగ చేసుకున్నారు. మండలంలో అన్ని గ్రామాల్లో వాసులు పండుగను ఘనంగా నిర్వహించారు. ఇళ్ల ముంగిట గోగు పుల్లలతో మంటలను వేసి అనంతరం టపాసులను కాల్చి పండుగ చేసుకున్నారు. రాపర్ల గ్రామంలోని వీరాంజనేయస్వామి ఆలయాన్ని దీపావళి పండుగను పురస్కరించుకుని ఆలయాన్ని దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి విశేష పూజలు చేశారు.

స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో

స్థానిక ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ కార్యాలయంలో దీపావళి సంబరాలు చేశారు. కార్యాలయంలో దీపాలను వెలిగించి పూజలు చేశారు. అనంతరం పార్టీ నేతలు అందరూ కలిసి దీపావళి టపాసులను వెలిగించి సందడి చేశారు. కార్యక్రమంలో పార్టీనేతలు డి. బాల వెంకటేశ్వరరెడ్డి, ఆరుమళ్ల రమాదేవి, ఎం.సుబ్రమణ్యం, కుందేటి రాణి, మోరా వెంకటరెడ్డి, ఆరుమళ్ల శివారెడ్డి, పీ రత్నకుమారి, నందిపు వెంకటనాంచారయ్య తదితరులు పండుగ వేడుకల్లో పాల్గొన్నారు.

తోట్లవల్లూరు: దీపావళి పర్వదిన వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే పిల్లలు, పెద్దలు పవిత్ర స్నానాలను ఆచరించి నూతన వస్త్రాలు ధరించారు. లక్ష్మీదేవికి ప్రీతిపాత్రమైన పిండివంటలు, పూలు, పండ్లతో మహిళలు పూజలు నిర్వహించారు. రాత్రికి ఆనందోత్సాహాల నడుమ పిల్లలు, పెద్దలు, యువతీ, యువకులు బాణసంచా కాల్చి సందడి చేశారు. తోట్లవల్లూరు బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాల వద్ద కొనుగోలుదారులతో సందడి వాతావరణం నెలకొంది. బాణసంచా అమ్మకాలను పమిడిముక్కల సీఐ కిషోర్‌బాబు, ఎస్ఐ విశ్వనాథ్ పరిశీలించారు.

పమిడిముక్కల: మండల ప్రజలు దీపావళి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండల గ్రామాల్లో ఇంటింట దీపపు కాంతులు వెల్లివిరిశాయి. కుటుంబమంతా టపాసులు కాల్చుతూ సందడిగా గడిపారు.

మండవల్లి: మండలంలోని గ్రామాల్లో ఆదివారం ప్రజలు దీపావళి వేడుకలు వైభవంగా జరుపకున్నారు. ఉదయం స్నానాదులు ముగించుకుని నూతన వస్త్రాలు ధరించి ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. రాత్రి పిల్లలతో పాటు బాణసంచ కాల్చి ఆనందాన్ని వ్యక్తం చేశారు. మండవల్లి, కానుకొల్లు, లింగాల, కొర్లపాడు, పెరికెగూడెం, భైరవపట్నం, అయ్యవారిరుద్రవరం, అప్పాపురం, లోకుమూడి తదితర గ్రామాల్లో పండుగను వైభవోపేతంగా నిర్వహించారు.



కైకలూరులోని నివాసంలో దీపావళి టపాసులు కాల్చుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్, కుటుంబ సభ్యులు



తోట్లవల్లూరులో టపాసులు కాలుస్తున్న దృశ్యం



పామర్రు ఎమ్మెల్యే కార్యాలయం వద్ద పార్టీ నేతల దీపావళి సందడి

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

గుడివాడ టౌన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను మంగళవారం నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు పలు గ్రంథాలయ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నందివాడ మండలం తమిరిశ, నందివాడ శాఖా గ్రంథాలయాల్లో ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. స్థానిక షా గులాబ్ చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. స్థానిక షా గులాబ్ చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో 14న చిన్నారులకు ఆటల పోటీలు, 15న పుస్తక ప్రదర్శన, 16న ఎస్ఆర్ రంగనాథన్, అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరి నాగభూషణం వంటి ప్రముఖులపై ఉపన్యాసాలు, 17న లఘునాటికలు, డ్రాయింగ్ పోటీలు, కవి సమ్మేళనం, 18న సీహెచ్ఆర్ చంద్రం రచించిన విదుర నీతిశతకం పుస్తకావిష్కరణ, 19న మహిళా చట్టాలపై అవగాహనా సదస్సు, 20న ముగింపు కార్యక్రమాలు ఉంటాయన్నారు. పట్టణ ప్రజలు ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

పామర్రు: మండ పరిధి జమీగొల్వేపల్లి గ్రామంలో శాఖ గ్రంథాలయంలో మంగళవారం నుంచి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు జమీగొల్వేపల్లి గ్రంథాలయ అధికారి వి.నాగ సురేష్ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా ప్రతి రోజు విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, చిత్ర లేఖనం, ఆటల పోటీలను నిర్వహించి చివరి రోజు బహుమతి ప్రధానం చేస్తామన్నారు. పామర్రులోని గ్రంథాలయంలో వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారిణి ఝాన్సీరాణి తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి గ్రంథాలయంలో వారోత్సవాల కార్యక్రమాలు ప్రారంభం అవుతాయని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రజా ప్రతినిధులుపాల్గొంటారని తెలిపారు.

తోట్లవల్లూరు: తోట్లవల్లూరులో మంగళవారం నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి బాబూరావు తెలిపారు. 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన ప్రారంభం, 16న గ్రంథాలయ ఉద్యమకారులపై ఉపన్యాసం, 17న కవి సమ్మేళనం, 18న విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు, 19న దిశ చట్టంపై విద్యార్థినులకు అవగాహన, 20న ముగింపు సభ, బహుమతుల ప్రదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఆయా కార్యక్రమాలను పాఠకులు, విద్యార్థులు విజయవంతం చేయాలని బాబూరావు కోరారు.



మండవల్లిలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

కైకలూరు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కై కలూరు గ్రంథాలయాధికారి కె.శ్రీనివాసరావు సోమవారం చెప్పారు. పుస్తక ప్రదర్శన, పఠనం, ప్రముఖుల ఉపన్యాసాలు, కవి సమ్మేళనలు, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు, చివరి రోజున బహుమతి ప్రధానోత్సవం జరుగుతోందన్నారు. విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

మండవల్లి: మండవల్లిలో గ్రంథాలయాధికారి షేక్ పర్వీన ఆధ్వర్యంలో సోమవారం గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఎస్.విజయ్‌కుమార్, ఐక్య వేదిక జిల్లా కార్యదర్శి ఎల్ఎస్ భాస్కరరావు మాట్లాడుతూ గ్రంథాలయాల్లో లభించే దిన, వార, పక్ష, మాస పత్రికలను చదవడం ద్వారా ప్రపంచంలో జరిగే విషయాలను ఆకళింపు చేసుకుని జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. గ్రంథాలయాధికారి షేక్ పర్వీన మాట్లాడుతూ 14 నుంచి 20 వరకు జరిగే గ్రంథాలయ వారోత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాల్సినదిగా కోరారు. కె. సుబ్బరాజు, పి.రామచంద్రరావు, దివాకర్ పాల్గొన్నారు.

ముదినేపల్లి రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారిణి ఎస్.శ్రీదేవి సోమవారం తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమ ప్రముఖుల చరిత్రపై ఉపన్యాసాలు, వ్యాసరచన పోటీలు 17న కవి సమ్మేళనం, 18న డిజిటల్ గ్రంథాలయాలపై వ్యాసరచన పోటీలు, 19న మహిళా సాధికారత సదస్సు, 20న వారోత్సవాల ముగింపు కార్యక్రమాలు నిర్వహించి పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేత

మచిలీపట్నంటౌన్: హైదరాబాద్‌కు చెందిన దాత సూరత్తు పాండురంగారావు రూ.40 వేలు విలువ చేసే ల్యాప్‌టాప్‌ను విద్యార్థిని మాకర్ల మాధురికి సోమవారం అందజేశారు. ఆదివెలమ సంఘం కార్యాలయంలో ఆ సంఘ ప్రతినిధి పిల్లారిశెట్టి శ్రీనివాసరావు చేతుల మీదుగా ల్యాప్‌టాప్‌ను మాధురికి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ నగరానికి చెందిన మాధురి ఎంసీఏ ద్వితీయ సంవత్సరం చదువుతోందన్నారు. గత ఐదేళ్లుగా పేద విద్యార్థులకు పాండురంగారావు విద్యా నిధి నుంచి ఆర్థిక సాయం అందిస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే మాధురికి రెండేళ్లుగా ఆర్థిక సాయం అందిస్తూ ఈ ఏడాది ల్యాప్‌టాప్‌ను అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో ఆదివెలమ సంఘం ప్రతినిధులు సత్యనారాయణ, విజయశంకర్ పాల్గొన్నారు.



మాధురికి ల్యాప్‌టాప్ అందిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

సహకార బ్యాంకుల్లో సొమ్ముకు భద్రత

గుడివాడ టౌన్(నందివాడ): పొదుపు సొమ్ముకు సహకార బ్యాంకులు భద్రత కల్పిస్తాయని జనార్ధనపురం సహకార బ్యాంక్ అధ్యక్షుడు కొండపల్లి లక్ష్మీ నాగేంద్ర కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం నందివాడ మండలం జనార్ధనపురం గ్రామంలో సహకార బ్యాంకుల పనితీరు, లాభాలు, ఇతర అంశాలపై ఏర్పాటు చేసిన జాతాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్ ఆదేశాల మేరకు ప్రజలకు సహకార బ్యాంకుల ప్రాధాన్యతను జాతా ద్వారా వివరిస్తున్నామన్నారు. ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా, సురక్ష యోజన బీమా, అటల్ పెన్షన్ యోజన, కిసాన్ క్రెడిట్ కార్డులు, నగదు రహిత లావాదేవీలు, ఏటీఎం సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. వీనిని వినియోగించుకుంటూ గ్రామీణ ప్రజలు సహకార బ్యాంకుల్లో సొమ్ము భద్రపర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సెక్రటరి విరివాడ అంజిబాబు, బ్యాంక్ ఉద్యోగులు, కళాజాత సిబ్బంది పాల్గొన్నారు.



జాతా నిర్వహిస్తున్న కళాకారులు

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

కాలువలోకి దూకి కాపాడిన ఏఎస్ఐ

పామర్రు:నిరాదరణను తట్టుకోలేక ఓ వృద్ధురాలు ఆత్మహత్యాయత్నం చేసింది. ఓ పోలీసు ఆమెను రక్షించాడు. వివరాలిలా ఉన్నాయి. పామర్రు గ్రామంలోని పుల్లేరు పై ఉన్న చిన్న వంతెనపై నుంచి ఓ వృద్ధురాలు కిందకూ దూకి కాలువలో కొట్టుకు పోతుండగా ఆమెను స్థానిక పామర్రు పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ దుర్గారావు ప్రాణాలకు తెగించి కాపాడిన సంఘటన సోమవానం రాత్రి పామర్రులో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. పిచ్చికలపూడి గ్రామానికి చెందిన కనుమూరి నాగరత్నం (65) కుటుంబంలో ఆదరణకు నోచుకోక తనువు చాలించాలని నిర్ణయించుకుంది. దీనికి పామర్రు బస్టాండ్ ఎదురుగా పుల్లేరు కాలువపై ఉన్నచిన్న వంతెనను ఎంపిక చేసుకుంది. రాత్రి 7 గంటలు దాటిన తర్వాత వంతెన ఎక్కి కాలువలోకి దూకి నీటి ప్రవాహానికి కొట్టుకు పోతోంది. విషయం గమనించి కొందరు కేకలు వేయడంతో సమీపంలో పోలీస్ స్టేషన్‌లో ఉన్న ఏఎస్ఐ దుర్గారావు వంతెన వద్దకు వచ్చాడు. పరిస్థితి గమనించి వృద్ధురాలిని కాపాడేందుకు కాలువలోకి దూకాడు. కాలువలో కొట్టుకు పోతున్న వృద్ధురాలిని పట్టుకుని ఒడ్డుకు చేర్చాడు. పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చిపంపించారు. వృద్ధురాలిని కాపాడిన ఏఎస్ఐ దుర్గారావుని ఎస్ఐ ప్రవీన్‌కుమార్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పలువురు అభినందించారు.



వృద్ధురాలితో పామర్రు ఏఎస్ఐ దుర్గారావు

వైద్య ఖర్చులకు సాయం

అవనిగడ్డ: మండల పరిధిలోని దక్షిణచిరువోలులంక గ్రామానికి చెందిన గోసాల బాలకోటేశ్వరరావుకు శ్రీరామావెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాం కిశోర్‌నాయుడు రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందించారు. నెల రోజుల క్రితం పక్షవాతం రావడంతో బాలకోటేశ్వరరావు ఇంటి దగ్గరే ఉంటూ వైద్యసేవలు పొందుతున్నారు. ఆయన ఇంటికి వెళ్లి శ్యాంకిశోర్ నగదు అందజేశారు. కార్యక్రమంలో బచ్చు శ్రీనివాసరావు, యండ్రపాటి బసవేశ్వరరావు, రాజులు, గోసాల సుధాకరరావు, దోనె నాగరాజు, సుధాకర్, నూతన్ పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి

తోట్లవల్లూరు: కోడిపందేల శిబిరంపై పోలీసులు దాడి జరిపి పలువురు పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్న ఘటన మండలంలోని ఐలూరు శివారు కనిగిరిలంకలో జరిగింది. గ్రామంలో నిర్వహిస్తున్న కోడిపందేల శిబిరంపై సోమవారం సాయంత్రం దాడి చేశామని ఎస్ఐ పి.విశ్వనాథ్ తెలిపారు. ఈ దాడిలో ఏడుగురు పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకుని రూ.36,150 నగదు, రెండు కోడిపుంజులు, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కొత పండుగ



తెలుగు చర్చి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్

మచిలీపట్నంటౌన్: నగరంలోని తెలుగుచర్చిలో ఆదివారం కోత పండుగను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రస్తుత ఖరీఫ్ పంటలు చేతికొస్తున్న నేపథ్యంలో దేవుడు పంటలను సమృద్ధిగా ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఈ కోత పండుగను ప్రతి ఏడాది నిర్వహించటం ఆనవాయితీ. నగరంలోని చర్చి ఆఫ్ సౌత్ ఇండియాకు సంబంధించిన ప్రొటెస్టెంట్ క్రైస్తవులు పరిశుద్ధ అంద్రేయ మహాదేవాలయంలో 127వ కోత పండుగను నిర్వహించారు. అలాగే నగరంలోని నోబుల్ కళాశాల సమీపంలోని నోబుల్ ప్యారిస్ చర్చిలో 37వ కోత పండుగను, సుకర్లాబాద్‌లోని ఆర్‌సీఎం చర్చిలో బైబిల్ మిషన్ సండే వేడుకను నిర్వహించారు. కోత పండుగ సందర్భంగా చర్చి ఆవరణలో పలు రకాల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. దేవుడు చేసిన ఉపకారానికి ప్రతీకగా క్రైస్తవులు ఈ సందర్భంగా అర్పణలు సమర్పించారు. రైతులు, ఉద్యోగులు, వ్యాపారులు వారి వార్షికాదాయంలో కానుకలు సమర్పించి దేవునికి కృతజ్ఞతలు తెలిపారు. స్టాల్స్‌లో ఉంచిన పలు వస్తువులను కొనుగోలు చేశారు. అలాగే లలితా ఆర్ట్స్ గ్యాలరీ ఏర్పాటు చేసిన చిత్రాల ప్రదర్శన, విక్రయ స్టాల్ పలువురిని ఆకర్షించింది. ఈ చిత్రాలను విక్రయించగా వచ్చిన మొత్తాన్ని చర్చికి ఇస్తున్నట్లు నిర్వాహకులు డిలాన్, వాలంటైన్లు తెలిపారు.

శ్రీశైలానికి బస్సు సౌకర్యం

గుడివాడ టౌన్: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని భకుల్త సౌకర్యార్థం రోజూ శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించినట్టు డిపో మేనేజర్ డి.రాజేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం నుంచి ప్రతి రోజూ రాత్రి 10 గంటలకు ప్రత్యేక బస్సు బయలుదేరుతుందన్నారు. భక్తులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 73829 03299, 91771 01904 నంబరులో సంప్రదించాలని కోరారు.